సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 11 । జూన్ । 2025



క్రీడా పాఠశాల ప్రవేశాలకు వేళాయె..!

చదువుతోపాటు చిన్నారులు క్రీడల్లోనూ రాణించాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నెలకొల్పిన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు వేళయింది. -8లో



వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే దాడులు

పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు టీడీపీ దాడులు చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా ధ్వజమెత్తారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/28.5

జిల్లాలో మంగళవారం 28.5 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మత్స్యశాఖ ఏడీగా నాగయ్య

కడప అగ్రికల్చర్: మత్స్యశాఖ ఏడీగా నాగయ్య నియమితులయ్యారు. ఆయన విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి వైఎస్సార్ జిల్లా ఏడీగా కడపకు వచ్చారు. ఇక్కడ ఏడీగా పని చేస్తున్న రెడ్డెయ్యను నంద్యాలకు బదిలీ చేశారు.

డీసీఓగా వెంకటసుబ్బయ్య..

జిల్లా సహకారశాఖ అధికారిగా వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. ఈయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే ప్రొద్దుటూరులోని జిల్లా సహకార శిక్షణా కేంద్రం అధ్యాపకుడిగా ఎన్‌టీఆర్ జిల్లాలో పని చేసే శ్రీనివాసులరెడ్డి నియమితులయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాల హక్కుల పరిరక్షణ కమిషన్‌లో చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌తో పాటు మొత్తం ఆరుగురు సభ్యుల నియామకానికి దరఖాస్తులను కోరుతున్నారన్నారు. మరిన్ని వివరాలకు 9440814416 నెంబరులో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిగా చంద్రానాయక్



చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల పరంపర కొనసాగుతుంది. బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారిగా చంద్రానాయక్ నియమితులయ్యారు. ఈయన అన్నమయ్య జిల్లా డీఏఓగా పని చేస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వచ్చారు. వైఎస్సార్ జిల్లా డీఏఓగా పని చేస్తున్న అయితా నాగేశ్వరావు గుంటూరు డీఏఓగా బదిలీపై వెళ్లారు. అలాగే జిల్లా లోని పలువురు ఏడీల తోపాటు ఏవోలు కూడా జి ల్లాలోని పలు ప్రాంతాలకు బదిలీలు అయ్యారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారిగా..



రవిచంద్రబాబు

జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర బాబు నియమితులయ్యారు. ఈయన కూడా అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తున్న సుభాషిణి అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. వీరితోపాటు జిల్లాలోని పలువురు మండల ఉద్యానశాఖ అధికారులు పలు మండలాలకు బదిలీ అయ్యారు. వీరితోపాటు జిల్లా హెడ్‌ఆఫీస్‌లో జిల్లా టెక్నికల్ హెచ్‌ఓగా పని చేస్తున్న జోతిర్మయి రాష్ట్ర హెడ్‌ఆఫీస్‌కు బదిలీకాగా ఆమె స్థానంలో హెడ్‌ఆఫీస్‌లో పని చేస్తున్న జీవన్ వస్తున్నారు.

మార్కెటింగ్‌శాఖలో..

మార్కెటింగ్‌శాఖ డీడీగా లావణ్య బదిలీపై వచ్చారు. కడప మార్కెటింగ్‌శాఖ డీడీగా గతంలో పని చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని కడప మార్కెట్ యార్డు సెక్రటరీగా నియమించారు.

కదం తొక్కిన మహిళలు



కడపలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు, కార్యకర్తలు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మహిళా నేతలు

- అత్యాచారాలు, హత్యలపై ఆందోళన
- నేతృత్వం వహించిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం
- రాష్ట్రంలో స్త్రీలకు రక్షణ కరువైందని మండిపాటు
- ప్రభుత్వం నిద్రపోతోందని ఆగ్రహం
- అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ

కడప కార్పొరేషన్: మహిళాలోకం కదం తొక్కింది. రాష్ట్రంలో స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై కన్నెర్ర చేసింది. ప్రభుత్వ వైఖరిపై నిరసన గళం విప్పింది. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కడపలోని కోటిరెడ్డి సర్కిల్‌లో జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షణ కల్పించాలి, అత్యాచారం, హత్యలకు గురైన కుటుంబాలకు న్యాయం చేయాలని నినదించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, రెండు రోజులకొక అత్యాచారం జరుగుతోందని మండిపడ్డారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేస్తే, కడపలో ఉండి కూడా హోంమంత్రి అనిత వారి కుటుంబాన్ని పరామర్శించిన పాపాన పోలేదన్నారు. అనంతపురంలో తన్మయి అనే గిరిజన బాలికను హత్య చేస్తే నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్ల వల్ల 32 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆరోపణలు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ఇప్పుడు వారిని వెనక్కి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని వద్దని రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్నారని మండిపడ్డారు. మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు పత్తి రాజేశ్వరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడానికి ముందుండే హోంమంత్రి అనిత మహిళలపై జరిగే అఘాయిత్యాల పట్ల స్పందించడం లేదన్నారు. తాను ఒక మహిళనే అన్న సంగతి ఆమె మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరినీ వదిలిపెట్టకుండా అత్యాచారాలు, హత్యలు చేస్తున్నారని, ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఆత్మస్తుతి..పరనిందలాగా ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. మహిళలకు రక్షణ కల్పించే దిశ చట్టాన్ని అటకెక్కించారన్నారు. పసిబిడ్డలను కూడా వదలకుండా అత్యాచారాలు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. నగరపాలక కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు మాట్లాడుతూ పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడు నియోజకవర్గంలో ఒక మైనర్ బాలికపై 14 మంది కొన్ని నెలలుగా అత్యాచారం చేస్తున్నా ప్రభుత్వం కళ్లు మూసుకొందే తప్ప న్యాయం చేయలేదన్నారు. ఆ బాలిక ఇప్పుడు 8 నెలల గర్భవతి అని, ఆ కుటుంబానికి దిక్కెవరని ప్రశ్నించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం సమర్పించారు. ఆందోళన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం సభ్యులు రత్నకుమారి, జింకా జయలక్ష్మి, సునీత, జ్యోతి, మల్లీశ్వరి, నారాయణమ్మ, సుశీలమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ కార్యాలయం వద్ద ఆందోళనపై ఫిర్యాదు

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సీఐకి ఫిర్యాదు పత్రాన్ని సమర్పిస్తున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ హరినాథరెడ్డి, పాత్రికేయులు

చింతకొమ్మదిన్నె: కడప సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద జూన్ 9వ తేదీన తెలుగుదేశం పార్టీ నాయకులు అప్రజాస్వామికంగా ధర్నా చేయడం దారుణమని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాక్షి బ్రాంచ్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, కడప రిపోర్టర్ దుర్గాప్రసాద్, చింతకొమ్మదిన్నె రిపోర్టర్ నాగమల్లారెడ్డి డిమాండ్ చేశారు.

ఈ మేరకు వారు మంగళవారం చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్‌లో సీఐ శివశంకర్ నాయక్‌ను కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. సాక్షి టీవీలో సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను వెంటనే కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించి, క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. అయినా టీడీపీ నాయకులు డైవర్షన్ రాజకీయాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయాలని పిలుపునివ్వడం దారుణం అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై సాక్షి కథనాలు ప్రచురిస్తుండటంతోనే కక్ష గట్టారని పేర్కొన్నారు. కడపలోని సాక్షి కార్యాలయం లోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించిన టీడీపీ దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాక్షి కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు చేసిన హంగామా సీసీ కెమెరాలలో రికార్డు అయిందని, ప్రత్యక్ష సాక్షులు సైతం ఉన్నారని, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తమ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతోపాటు సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. దీనివల్ల సిబ్బంది ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

షట్‌డౌన్ దిశగా అల్ట్రాటెక్!

- కొనసాగుతున్న కూటమి ఎమ్మెల్యే వేధింపులు
- కార్మికులు పరిశ్రమలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న వైనం
- పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు ముప్పతిప్పలు
- ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువు



సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, క్షేత్రస్థాయిలో కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వేధింపులు వెరసి అల్ట్రాటెక్ పరిశ్రమ యాజమాన్యం షట్‌డౌన్ దిశగా అడుగులు వేస్తోందా? అని ప్రశ్నిస్తే ఔను అనే విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 48 రోజులుగా అల్ట్రాటెక్‌లో సిమెంటు ఉత్పత్తి నిలిచిపోయింది. కార్మికులు, పర్మినెంట్ ఉద్యోగులను పరిశ్రమలోకి వెళ్లకుండా అడ్డుతగులుతున్నారు. స్వయంగా పోలీసు అధికారులు దగ్గరుండీ ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈక్రమంలో పరిశ్రమ నిర్వహణ కష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు.

- చిలంకూరు అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ యాజమాన్యం తలొగ్గి బతిమాలాడాలనే తలంపుతో కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఉన్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అందు కోసం అధికార దుర్వినియోగం ఎలా చేయాలో అంతా సంపూర్ణంగా వినియోగించుకుంటున్నారు. ఓవైపు అనుచరులు, మరోవైపు పోలీసులను కాపలాగా పెట్టి వలసపల్లె, కర్చుకుంటుపల్లె, తుమ్మలపల్లె, దేవగుడి గ్రామాలకు చెందిన ఎమ్మెల్యే అనుచరులు అక్కడే తిష్టవేసి పర్మినెంట్ ఉద్యోగులను సైతం విధుల్లోకి వెళ్లనీయడం లేదని పలువురు వాపోతున్నారు. అదేమంటే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ అవుతోందని స్వయంగా పోలీసు అధికారులు అడ్డుతగులుతున్నట్లు తెలుస్తోంది. ఆ సాకు చెబుతూ విధులకు హాజర కాకుండా అడ్డగిస్తున్నట్లు సమాచారం. మరోవైపు చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలని ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే తమ సీఐ ఇరువురి మధ్య పరిష్కారం చూపుతారంటూ యర్రగుంట్ల సర్కిల్ కార్యాలయానికి చెందిన కిందిస్థాయి పోలీసు అధికారులు చెబుతున్నట్లు యాజమాన్య ప్రతినిధులు వివరిస్తున్నారు. ఇదివరకు ముడిఖనిజం సరఫరా చేసే టిప్పర్లపై కేసులు నమోదు చేసి వ్యూహాత్మకంగా అడ్డుకున్నారు. అధికారులు అలా ఎమ్మెల్యేకు అండగా సహకరిస్తుంటే, మరోవైపు ప్యాకింగ్ ప్లాంట్‌ను దక్కించుకొని యాజమాన్యంతో సంబంధం లేకుండా ప్యాకింగ్ ప్లాంట్ మూసివేశారు. వెరసి 48 రోజులుగా సిమెంటు ఉత్పత్తి ఆగిపోయింది.

చెప్పేందుకే నీతులు



‘రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే అన్నీ అనుమతులు ఇచ్చి రికార్డు టైమ్‌లో దాన్ని అమల్లోకి తెచ్చేందుకు బాధ్యత తీసుకుంటున్నాను. మీరంతా సమీప భవిష్యత్‌లో కనీసం ఒక్క వ్యాపారమైనా ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలి.’ సీఎం చంద్రబాబు ఇటీవల సీసీఐ చర్చాగోష్టిలో పారిశ్రామికవేత్తలతో అన్నమాటలివి. నోటితో చెప్పడం నొసలుతో వెక్కిరించడం, దేని పని దానిదే అన్నట్లుగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. మాటలకు, చర్యలకు పొంతన ఉండదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చిలంకూరు అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ నిలుస్తోందని పలువురు చెప్పుకొస్తున్నారు. ఉత్పత్తిలో పొలిటికల్ వాటాలు ఇవ్వాల్సిందేనని నిక్కచ్చిగా సీఎంఓ పేర్కొనడంతోనే సమస్య జఠిలంగా మారినట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల పట్ల చిత్తశుద్ధి ఉంటే అల్ట్రాటెక్ పరిశ్రమలో ఉత్పత్తి నిలిచిపోతుందా? 48 రోజులుగా సిమెంటు ఉత్పత్తి నిలిచిపోతే జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఎవ్వరికీ పట్టకపోవడం గమనార్హం. సీఎం చంద్రబాబు సర్కార్‌లో రాజధాని నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎవరి వాటాలు వారికి దక్కించుకునేందుకు ముప్పుతిప్పలు పెడుతున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

పరిశ్రమ మూసేస్తే.. మా పరిస్థితి ఏంటి?



నిరసనకారులతో వాగ్వాదానికి దిగిన కార్మికులు

జమ్మలమడుగు : తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్యాకింగ్ యూనిట్‌లో పని చేస్తున్న కార్మికులు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ గేటు వద్ద వారం రోజుల నుంచి నిరసనలు తెలియజేస్తూ.. ఎవరూ లోనికి పోకుండా అడ్డుకుంటున్నారు. అయితే రెండు రోజుల నుంచి ఐసీఎల్ (అల్ట్రాటెక్) పరిశ్రమలో పని చేస్తున్న మెయింటెనెన్స్ కార్మికులు, ఇతర కార్మికులు తమ విధులకు హాజరు కావాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వారు తమ పని చేయడం కోసం పరిశ్రమ వద్దకు వెళ్లారు. నిరసన చేస్తున్న కార్మికులు.. లోనికి వెళ్లవద్దు అంటూ అడ్డుకున్నారు. తమని ఎందుకు అడ్డుకుంటున్నారు, తమ పని చేసుకోనివ్వండి పరిశ్రమలు ఇక్కడి నుంచి తరలిపోతే మా పరిస్థితి ఏమిటంటూ వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్మికులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.



చదువుకొనేదెలా..!

- భయ పెడుతున్న బడి ఫీజు
- ప్రైవేటు, కార్పొరేట్‌లో భారీగా పెరిగిన వైనం
- తడిసి మోపెడు అవుతున్న స్కూల్ ఖర్చులు
- సామాన్యులకు భారంగా విద్య
- అయినా కాన్వెంటు వైపే మొగ్గు
- రేపు పాఠశాలలు పునఃప్రారంభం



కడప ఎడ్యుకేషన్: జూన్ నెలంటేనే పేద, మధ్య తరగతి ప్రజల గుండె గుబేల్‌మంటుంది. ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు ప్రతి ఒక్కరూ చదువులకు సంబంధించి పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, బూట్లు, టై, బెల్ట్, బ్యాగులు ఇలా అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేయాల్సి రావడంతో తల్లిదండ్రులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇలా జూన్ నెలలో అన్ని రకాల వస్తువులను ఒకే సారి కొనుగోలు చేయాల్సి రావడంతో.. ఒక్కసారిగా ఆర్థిక భారం పడుతోంది. నర్సరీ మొదలుకుని కళాశాల విద్య వరకు వేలాది రూపాయలు పోసి చదువులను కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఏడాది ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయని, అయినా కానీ అప్పోసప్పో చేసి పిల్లలను బడిలో చేర్పించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన తల్లికి వందనం కూడా ఇవ్వకపోవడంతో మరింత ఆర్థిక భారం పడుతోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలు తెరిచేనాటికి పిల్లలకు తల్లికి వందనం నిధులను విడుదల చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ముందు నుంచే అడ్మిషన్లు

ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కానీ ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లు ప్రారంభించాయి. దీంతోపాటు వేసవి సెలవుల్లో తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాలల్లో పని చేసే సిబ్బందికి కూడా అడ్మిషన్లకు సంబంధించి లక్ష్యం విధించి వేధించారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై విద్యార్థి సంఘాలు పలుమార్లు ఆందోళన చేసినా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

వ్యాపార కేంద్రాలుగా..

సరస్వతీ నిలయాలుగా విరాజిల్లాల్సిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నేడు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి. ఫలితంగా సగటు జీవి తన పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలంటే గుండె గుబేల్‌మంటుంది. కొందరు తల్లిదండ్రులు తమ చిన్నారులను బాగా చదివించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే ఆశతో ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ వైపు అడుగులు వేస్తున్నారు. అదే అదునుగా భావించిన కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు తల్లిదండ్రుల చెవులు పిండి క్యాష్ చేసుకుంటున్నారు. అడ్మిషన్ ఫీజు మొదలుకుని టై, షూ, బెల్టులతోపాటు పుస్తకాల వరకూ అన్ని వారే సరఫరా చేస్తున్నారనే విమర్శలు మెండుగా ఉన్నాయి.

మార్కెట్ ధరల కంటే అధికంగా..

విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చేరిన తర్వాత విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు మొదలుకొని యూనిఫాం, టై, బెల్ట్, షూ వంటి వాటిని కచ్చితంగా కొనుగోలు చేయాల్సిందే. అదే అదునుగా ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు సంబంధిత వస్తువులను వారి పాఠశాలలో ఏర్పాటు చేసుకుని బహిరంగ మార్కెట్ కంటే అధిక రేట్లతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విద్యార్థి సంఘ నాయకులు విమర్శిస్తున్నారు.

ఫీజుల వివరాల అంచనా ఇలా..

తరగతి	ఫీజు మొత్తం (రూ.వేలల్లో)
ప్లే స్కూల్స్	22 – 30
ఎల్‌కేజీ, యూకేజీ	15 – 25
ఒకటి, రెండు తరగతులు	20 – 40
3, 4, 5 తరగతులు	20 నుంచి 50
6, 7, 8 తరగతులు	22 నుంచి 55
9, 10 తరగతులు	25 నుంచి 75

1 నుంచి 5వ తరగతి విద్యార్థుల పుస్తకాల ధరలు: రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు

6 నుంచి 10వ తరగతి పుస్తకాలు: రూ. 8 నుంచి 12 వేల వరకు

యూనిఫాం మూడు జతలు: రూ.1500 నుంచి 2 వేల వరకు

షూ, టై, బెల్ట్ తదితర వస్తువులు: రూ.500 నుంచి 1000 వరకు

కూలి పని చేసుకునే స్థాయి నుంచి..

కూలి పని చేసుకునే వాడి దగ్గరి నుంచి వ్యాపారం చేసుకునే వారి వరకు, అటెండర్ నుంచి ఆఫీసర్ స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను కాన్వెంట్ చదువులను చదివించాలని ఆసక్తి చూపుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల వారు ఏటా ఫీజులు పెంచుతున్నారు. ఫీజులను నియంత్రించాల్సిన అధికారుల చేష్టలుడిగి ప్రవర్తించడంతో.. అది కాస్తా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి పెనుభారంగా మారుతూ అప్పుల ఊబిలోకి వెళుతున్నారు.

పెరిగిన ధరలు

ఆటపాటలతో మునిగి తేలిన చిన్నారులు ఇక పాఠశాల బాట పట్టనున్నారు. ఈ నెల 12వ తేదీ (గురువారం) నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.ఈ ఏడాది కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో 10 నుంచి 20 శాతం వరకు ఫీజులు పెంచినట్లు తెలిసింది. అదే విధంగా పుస్తకాల ధరలు భారీగా పెరిగాయి. 6వ తరగతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బూట్లు, టై వంటికి గతేడాది 6 వేలు ఉంటే.. ఈ ఏడాది రూ. 8 వేల దాకా అవుతోందని తల్లిదండ్రులు అంటున్నారు. వీటితోపాటు పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు, అట్టలు వంటి అదనపు ఖర్చులు మరింత భారం అవుతున్నాయని వారు వాపోతున్నారు. ఇలా అన్ని కలిపి గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.5 వేలు నుంచి రూ.10 వేల దాకా ఖర్చు పెరిగిందని ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమైనా...

పులిని చూసి నక్క వాత పెట్టుకున్న సామెత లాగా.. సామాన్య, మధ్య తరగతుల వారు కూడా తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్‌లో చదివించాలనే ఆశతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అయినా సరే తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోంది. అయినా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుంది. అపారమైన అనుభవంతోపాటు అర్హత గల ఉపాధ్యాయులు ఉంటారు. అలాగే ఇంగ్లిష్ మీడియం ఉంది. ప్రభుత్వం విద్యా సామగ్రి ఉచితంగానే అందిస్తుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఆర్భాటాలు చూసి తల్లిదండ్రులు మోసపోవద్దు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ, అధికారి

క్లుప్తంగా

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం ఉదయం 9.30 గంటలకు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 14, 15వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని, మరిన్ని వివరాలకు 9949686586, 8019880995 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

యువకుడి మృతి


ప్రశాంత్

వీరపునాయునిపల్లె : మండలంలోని వీరపునాయునిపల్లె ఎస్సీ కాలనీలో యువకుడు ప్రశాంత్(22) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు ప్రశాంత్ తల్లి మృతి చెందడంతో మద్యానికి బానిసైన ప్రశాంత్ జులాయిగా తిరుగుతూ తరచూ తండ్రితో గొడవపడేవాడు. గతంలోనూ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం ఉందని ఎస్సై మంజునాథ్ తెలిపారు. రెండు రోజుల కిందట మళ్లీ తండ్రీ, కొడుకుల మధ్య ఘర్షణ జరగడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లోనే ప్రశాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


వెంకటయ్య(ఫైల్)

గోపవరం : మండలంలోని రాచాయపేట పంచాయతీ బెడుసుపల్లి దళిత వాడకు చెందిన అట్లూరు వెంకటయ్య(45) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నవరం నుంచి ద్విచక్ర వాహనంలో వెంకటయ్య బెడుసుపల్లెకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో అదుపు తప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటయ్య మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు 14 ఏళ్ల కుమార్తె ఉంది. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పాఠశాల ప్రవేశాలకు వేళాయె..!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జులై 1 నుంచి జిల్లా స్థాయి ఎంపికలు



నగర శివార్లలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల

కడప వైఎస్సార్ సర్కిల్ : చదువుతో పాటు చిన్నారులు క్రీడల్లోనూ రాణించాలనే సత్సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నెలకొల్పిన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు వేళయింది. ఆయన హయాంలో కడప శివారులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో నాటి నుంచి నేటి వరకూ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ సత్తా చాటారు. ఎంతోమంది ప్రతిభ చాటి ఉన్నతస్థాయికి చేరారు. ఈ ఏడాది క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5వ తరగతి విద్యార్థుల ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదలైంది. క్రీడా పాఠశాలలో ప్రవేశాలు పొందితే మంచి భవిష్యతు ఉంటుందని భావించిన తల్లిదండ్రులు తమ పిల్లలను సిద్ధం చేస్తున్నారు.

19వ తేదీ వరకూ గడువు

ఆన్‌లైన్ ద్వారా మే 31వ తేదీ నుంచి జూన్ 19వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 4వ తరగతిలో 40 సీట్లకు గానూ బాలురు–20, బాలికలు–20, 5వ తరగతిలో మొత్తం 40 సీట్లకు గాను బాలురు–20, బాలికలు –20 మందికి అవకాశం కల్పిస్తున్నారు. గతంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికలు జరిగేవి. ఈ ఏడాది నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మాత్రమే ఎంపికలు నిర్వహించనున్నారు. 4వ తరగతి ప్రవేశానికి 01–04–2015–31–03–2017 మధ్య జన్మించిన వారు, ఐదో తరగతికి 01–04–2014 నుంచి 31–03–2016 మధ్య జన్మించిన వారు అర్హులవుతారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, దరఖాస్తుదారుడి ఒరిజినల్ డాక్యుమెంట్లు, వైద్య పరీక్షల తర్వాత జిల్లా స్థాయి ఎంపిక పరీక్షలలో పాల్గొనడానికి అర్హత ఉంటుంది.

ఎంపికలు ఇలా.....

జిల్లా స్థాయిలో ఈ ఏడాది జులై 1వతేదీ నుంచి 3వ తేదీ వరకు కడప డీఎస్‌ఎ స్టేడియంలో చేపట్టనున్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్ , స్టాండింగ్ బ్రాండ్ జంప్, మెడిసిన్ బాల్, షటిల్ రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 మీటర్ల పరుగు పందెం వంటివి నిర్వహిస్తారు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయి శారీరక సామర్థ్య ఎంపికలను ఈ ఏడాది జులై 10, 11వ తేదీల్లో నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనపరిచిన వారు క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందేందుకు అర్హులుగా నిలుస్తారు. జులై 24వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

దరఖాస్తు చేసుకోవాలి

వచ్చే విద్యా సంవత్సరానికి కడప క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 19తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు జరుగుతాయి. అర్హత ఉండి ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.



-జగన్నాథరెడ్డి, ఇన్‌చార్జ్ డీఎస్‌డీవో, వైఎస్సార్ కడప జిల్లా

పల్లె నుంచి.. యునైటెడ్ కింగ్‌డమ్‌కు

జిల్లా విద్యార్థినికి ఎడెన్‌బర్గ్ వర్సిటీలో సీటు


పూర్ణిమ నిమ్మకాయల

కడప సెవెన్‌రోడ్స్ : నగరానికి చెందిన విద్యార్థిని యూకేలో సీటు సాధించి భళా అనిపించింది. కడప నగరానికి చెందిన పూర్ణిమ నిమ్మకాయల యునైటెడ్ కింగ్ డమ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఎడెన్‌బర్గ్ యూనివర్సిటీలో సీటు సాధించి అందరినీ అబ్బుర పరిచారు.

వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె గ్రామానికి చెందిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి, కె.అనితల కుమార్తె పూర్ణిమ ఒకటో తరగతి నుంచి 3వ తరగతి వరకు కడప వికాస్ హైస్కూల్, 4 నుంచి 10వ తరగతి వరకు కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఇంటర్మీడియేట్ హైదరాబాద్ బేగంపేటలోని హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లోనూ చదివారు. ఆ తర్వాత పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో బీఎస్సీ(ఆనర్స్) చేశారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఎడెన్‌బర్గ్ యూనివర్శిటీలో ఎంఎస్ మేథమ్యాటికల్ ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్‌కు దరఖాస్తు చేశారు. ఎడెన్‌బర్గ్ యూనివర్శిటీ యాజమాన్యం ఈ మేరకు ఆమెకు ఐడీ నెంబరు 2858866కు జారీ చేసి జులై 28న అడ్మిషన్ పొందాలని సమాచారం పంపింది. క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2025లో ఎడెన్‌బర్గ్ వర్శిటీ 27వ స్థానంలో ఉంది. చార్లెస్ డార్విన్, అలెగ్జాండర్ గ్రహంబెల్, ప్రఫుల్ల చంద్రరే, ప్రకాశ్ కారత్, ఓలివర్ గోల్డ్‌స్మిత్, డేవిడ్ హ్యూమ్, వాల్టర్ స్కాట్ తదితర వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు ఈ యూనివర్శిటీలో చదివారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే ఐఈఎల్‌టీఎస్‌లో 8 పాయింట్లు సాధించి ప్రతిష్ఠాత్మక ఎడెన్‌బర్గ్ వర్శిటీలో పూర్ణిమ సీటు సాధించారు. అంతేగాక యూకేలోని బ్రిస్టల్ యూనివర్శిటీలోనూ ఎంఎస్‌లో ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్ మేథమ్యాటిక్స్‌లోనూ, లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఫైనాన్షియల్ మేథమ్యాటిక్స్ అండ్ మేథమ్యాటిక్స్ ప్రవేశానికి కూడా పూర్ణిమ అర్హత సాధించారు. ఈ ఘనత సాధించిన ఆమెను పలువురు అభినందించారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–19 క్రికెట్ పోటీలు ప్రారంభం


ధీరజ్ కుమార్ రెడ్డి (నాలుగు వికెట్లు)


రణధీర్‌రెడ్డి (54 పరుగులు)


విఖ్యాత్ (66 పరుగులు)

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్–19 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం ప్రారంభమయ్యాయి. కడప కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 33.1 ఓవర్లలో 124 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 128 పరుగులు సాధించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 54, రోహిత్ వర్మ 37 పరుగులు చేశారు.

ఏడు వికెట్ల తేడాతో కర్నూలు జట్టు విజయం

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కిన్ను కిషన్ 50 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మహిత్ 3, నౌసూన్ కళ్యాణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 177 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 34.0 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 180 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని విఖ్యాత్ 66 పరుగులు చేశాడు.

గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ ఏర్పాటు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : పుత్తడిపురి ప్రొద్దుటూరులో గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ (జీజేఎంసీ) ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ బంగారు వ్యాపారంలో రెండవ బాంబేగా ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరులో జీజేఎంసీ ఏర్పాటయితే వైఎస్సార్ కడప జిల్లాకు దేశ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన తయారీదారులు, పెట్టుబడి దారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం శ్రీనివాస మూర్తి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఎల్డీఎం జనార్దనం, డీటీసీ డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ రంగరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ పాల్గొన్నారు.

కేటాయించిన లక్ష్యం అధిగమిద్దాం


దరఖాస్తులు పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో కంపెనీలకు కేటాయించిన బిందు, తుంపర సేద్యం లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషిచేయాలని ఏపీ సూక్ష్మనీటి సాగు పథకం జిల్లా అధికారి వెంకటేశ్వరరెడ్డి సూచించారు.కడప ఏపీఎంఐపీ కార్యాలయంలో వివిధ కంపెనీల సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి 15వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పథకం అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఐదెకరాల పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, పదెకరాలు కలిగిన రైతులకు 90 శాతం, 12.5 ఎకరాలున్న రైతులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


గొడ్డలితో దాడి

ముద్దనూరు : ఓ సంఘటనలో ఇరు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. దేనేపల్లెలో రామ్మోహన్ ఈ నెల 8న పెద్దమ్మ తల్లికి కొందరి సాయంతో యాటలు నిర్వహించాడు. అయితే గూనిగాండ్ల శివను దీనికి పిలవలేదు. దీంతో రామ్మోహన్ నీ కథ చూస్తా అంటూ గూనివాండ్లశివ బెదిరించాడు. అంతటితోఆగకుండా రామ్మోహన్ మంగళవారం తోటలో పనిచేయిస్తుండగా.. లక్ష్మయ్య, శివశంకర్, నరసింహ, ఉత్తయ్యలతో వచ్చి.. శివ తన గొడ్డలితో రామ్మోహన్‌పై దాడిచేశాడు. గాయాలైన రామ్మోహన్ ఫిర్యాదు మేరకు గూనివాండ్లశివ, మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి రామ్మోహన్ తోటలో కూలి పనులకు వెళ్లింది. పైపులు తేవాలంటూ తోట యజమాని రామ్మోహన్ ఆమెను పిలిచాడని, అక్కడ అసభ్యంగా ప్రవర్తించాడని, తప్పించుకోబోగా కులం పేరుతో దూషించాడని విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏదో విధంగా తప్పించుకుని బయటపడినట్లు ఆరోపించింది. దీంతో రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని ధారా అపార్ట్‌మెంట్ వెనుకవైపున గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు ఉరేసుకొని ఉండటంతో ఆ ప్రాంత వాసులు మంగళవారం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి సుమారు 65–70 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీస్


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

జమ్మలమడుగు : కుటుంబ కలహాలతో విసిగి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన వ్యక్తిని వారించి రైల్వే పోలీసులు ప్రాణాలు కాపాడిన సంఘటన మంగళవారం జరిగింది. ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి పల్లెటి మునుస్వామి మంగళవారం ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన రైల్వే స్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం అర్ధరాత్రి జీఆర్‌పీ ఆర్ఎస్‌ఐ రవిచంద్ర, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శివకుమార్ కలమల్ల రైల్వే స్టేషన్‌కు వెళ్లి మునుస్వామిని విచారించారు. అతడిని వారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కౌన్సిలింగ్ ఇచ్చి మునుస్వామిని భార్య, కుమారుల వెంట పంపించారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉత్తర్వులిచ్చారు. బ్రహ్మంగారిమఠంలో పనిచేస్తున్న డి.దామోదర్‌రెడ్డిని ఒంటిమిట్టకు, అక్కడ పనిచేస్తున్న ఏవీ.రమణమ్మను ఖాజీపేటకు బదిలీచేశారు. ఖాజీపేటలో ఉన్న డి.మహబూబ్‌బాషాను జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలోని కేఆర్‌ఆర్‌సీ విభాగానికి బదిలీ చేశారు. గోపవరం తహసీల్దార్ ఆర్.జీవన్ చంద్ర శేఖర్‌ను ముద్దనూరుకు బదిలీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నందున జీవన్ చంద్రశేఖర్‌ను జిల్లా కేంద్రంలోనే ఉంచాల్సి ఉంది. అయినా కడపలో కాకుండా ముద్దనూరుకు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

నలుగురికి పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి జిల్లాలో నలుగురు డిప్యూటీ తహసీల్దార్లకు తాత్కాలిక పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీదర్ చెరుకూరి ఉత్తర్వులు జారీ చేశారు. కడప జీఎన్‌ఎస్‌ఎస్–2కు ఎస్‌డీసీ కార్యాలయంలో పనిచేస్తున్న కె.కార్తీక్‌కు పదోన్నతి కల్పించి బ్రహ్మంగారి మఠం మండల తహసీల్దార్‌గా నియమించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లుగా ఉంటున్న డి.అమరేశ్వరి, ఎస్.పీర్ మున్ని, పి.లక్ష్మీప్రసన్నలకు తహసీల్దార్లుగా తాత్కాలిక పదోన్నతులు కల్పించి ఆ జిల్లాకే కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వైఫల్యం కప్పిపుచ్చుకొనేందుకే దాడులు

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్ట్ అక్రమం
- టీడీపీ నేతలదంతా కల్పిత ఉద్యమం
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా




విలేకరులతో మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా ధ్వజమెత్తారు. కడపలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏదైనా పెద్ద సమస్య జరిగితే దాని నుంచి ప్రజలను పక్కదారి పట్టించడంలో చంద్రబాబును మించిన వారు దేశంలోనే లేరన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు ఐదు దశాబ్దాలుగా జర్నలిస్టుగా ఉన్నారని, పలు పత్రికల్లో, టీవీల్లో ఆయన పనిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొమ్మినేని డిబేట్ షోలకు ప్రజాదరణ ఉందని, ఆయనంటే చంద్రబాబుకు పడదన్నారు. 2014లో ఎన్‌టీవీ ప్రసారాలు బంద్ చేస్తామని బెదిరించి ఆయన్ను తొలగించేలా చేశారని గుర్తుచేశారు. టీవీల్లో డిబేట్లు జరిగినపుడు పాల్గొన్న విశ్లేషకులు రకరకాల వ్యాఖ్యలు చేస్తుంటారన్నారు. ఇందులో భాగంగానే క్రిష్ణంరాజు అమరావతి పరిసరాల్లో సెక్స్ వర్కర్లు ఎక్కువగా ఉన్నారని వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. క్రిష్ణంరాజుతోపాటు కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి ఛానెల్ కూడా క్షమాపణ కోరిందన్నారు. అయితే టీడీపీ నేతలు ఇంతటితో ఆగకుండా సాక్షి ఛానెల్, వైఎస్ జగన్‌ను, వైఎస్ భారతిలను ఇందులోకి లాగడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా ఏ హామీలు అమలు చేయలేదని ప్రజలు ప్రశ్నించే పరిస్థితి వచ్చిందన్నారు. 'వెన్నుపోటు దినం' విజయవంతం కావడంతో ప్రజల దృష్టి మరల్చేందుకు ఓ కల్పిత ఉద్యమాన్ని సృష్టించి సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి, కొమ్మినేనిని అరెస్ట్ చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీవీ5, ఏబీఎన్, మహా టీవీలలో సాంబశివరావు, వెంకటక్రిష్ణ, రాధాక్రిష్ణ, వంశీక్రిష్ణలాంటి వారు విషం కక్కుతూ ఎన్నో వ్యాఖ్యలు చేశారని, ఆ రోజున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని ఇలా వేధించలేదన్నారు. ఫేక్ ఐడీలతో కిరాక్ ఆర్‌పీ, సీమరాజా వంటివారు బండబూతులు తిడుతున్నా వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో దళిత మైనర్ బాలికను నెలల తరబడి గ్యాంగ్ రేప్‌చేసి హత్య చేయడం చూస్తుంటే అసలు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చే వారిపై అక్రమ కేసులు బనాయించి, టీడీపీ నాయకులను కాపాడటానికే పోలీసు వ్యవస్థ ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, మున్సిపల్ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి, షఫీ, జోన్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, కంచుపాటి బాబు, అబ్దుల్ సుభాన్, డీజే అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయలేక డైవర్షన్ పాలిటిక్స్

- సాక్షి కార్యాలయాలపై దాడులు సిగ్గుచేటు
- క్షమాపణ కోరినా దాడులు చేయడం దారుణం
- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎవరో చెప్పారంటూ.. ఒక అంశాన్ని పట్టుకుని వైఎస్సార్‌సీపీ, సాక్షికి ముడిపెట్టి టీడీపీ నాయకులు ఇష్టానుసారం దాడులకు పాల్పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పక్కనపెట్టి టీడీపీ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆందోళన చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్పందన వచ్చిందన్నారు. దీనిని జీర్ణించుకోలేక కెఎస్‌ఆర్ లైవ్ షోలో జరిగిన అంశాన్ని అమరావతి ప్రజలందరికీ ఆపాదించడం తగదన్నారు. కెఎస్‌ఆర్ క్షమాపణ చెప్పినా పట్టించుకోకుండా, సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరైందికాదన్నారు. ఈ రోజు అధికారం ఉందని ఇష్టారాజ్యంగా కేసులు పెట్టి జైలుకు పంపడమేగాక, చానెల్స్‌లో మాట్లాడటానికి వీలులేని భాషలో వైఎస్సార్‌సీపీ నాయకులపై కామెంట్లు చేస్తున్నారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత మీ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలని, కావాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అంటూ చెప్పే చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి హామీలు గుప్పించి.. ఇపుడు చేతగాక చిన్న విషయాన్ని పట్టుకుని ప్రజల చూపు మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పోరెడ్డిమహేశ్వరరెడ్డి, వేణుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా..?


పులివెందులలో పోలీసులకు వినతి పత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు


ముద్దనూరులో ఎస్‌ఐకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు

- అక్రమ అరెస్ట్‌పై మండిపడిన పాత్రికేయులు
- పోలీసులకు వినతి పత్రాలు

పులివెందుల టౌన్ : సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్ అక్రమ అరెస్టు, సాక్షి కార్యాలయాలపై దాడులు, పత్రికా విలేకరులు, మీడియా మిత్రులపై జరుగుతున్న అక్రమ అరెస్టులను ఆపాలంటూ పులివెందుల జర్నలిస్ట్ అసోసియేషన్ ర్యాలీ చేపట్టింది. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండు నుంచి మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, కచేరి రోడ్డు మీదుగా అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు మీడియా మిత్రులు ర్యాలీగా చేరుకుని ఏఎస్‌ఐ సిద్ధార్థ, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరెడ్డిలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాత్రికేయుల అక్రమ అరెస్టులపై, దాడులు, దౌర్జన్యాలు జరగకుండా చూడాలని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కార్తీక్, రాజు, దామోదర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణకుమార్, చంద్రమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, జయరామిరెడ్డి, విమన్, సుబ్బారెడ్డి, ప్రకాష్, రాము, రామ్మోహన్, శంకర్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడి, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఐ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్(సాక్షి), ఏసు(ప్రజాశక్తి), బాలకృష్ణ(వార్త), సుధాకర్(విశాలాంధ్ర), శ్రీనివాసులు (ప్రజాభూమి)నందకుమార్(జ్యోతి), భాస్కర్‌బాబు(సాయంకాలం) పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్

సాంకేతిక సమస్యలతో
రాత్రి ఏడు గంటలకు ప్రారంభం


కౌన్సెలింగ్‌లో పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్ : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్‌జీటి) మ్యానువల్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో కడప శంకరాపురం స్కౌట్ హాల్‌లో కౌన్సెలింగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే సాంకేతిక సమస్య తలెత్తడంతో రాత్రి ఏడు గంటల వరకు ఎస్‌జీటీలు వేచి చూడాల్సి వచ్చింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంపీపీ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి 2410, కడప కార్పొరేషన్ ఉర్దూ, ప్రొద్దుటూరు మున్సిపాలిటి పరిధిలో మరో 130 పోస్టులకుగానూ ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకూ 360 మందికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీల ప్రక్రియ ఈ నెల 14వతేదీ నాటికి ముగుస్తుందని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.